

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవా సమితి ప్రచురణ)

సంపుటి : 19 జూలై, 2022 సంచిక : 2

**సంస్థాపకులు :**
శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు
**సంస్థాపక సంపాదకత్వం :**
శ్రీ మాతా శుకవాణి
**ప్రధాన సంపాదకత్వం :**
శ్రీశ్రీశ్రీ స్వామీ శ్రీరామానంద ప్రభుజీ
**ప్రత్యేక సహకారం :**
డా॥ జి.చంద్రారెడ్డి M.A, M.Ed., Ph.D
శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)
శ్రీమతి పి.వి. ధనలక్ష్మి (డి.టి.పి)
**ప్రచార సారథ్యం :**
శ్రీ బి. గోపీకృష్ణ
శ్రీమతి బులుసు జయ

**సాయివాణి చందా వివరాలు**
ద్వైవార్షిక చందా. ......... రూ॥ 200/-
ఆజీవ సభ్యత్వం .......... రూ॥1000/-

**చిరునామా :-**
**సాయివాణి**
సాయిధామం, బొమ్మల రామవరం మండలం,
యాదాద్రి భువనగిరి జిల్లా-508 126.
Ph : 9440413455, 9848133565
Online Donations :
SRI SAI SEVA SAMITHI TRUST
A/c No.62002652136
SBI Keesara Branch,
IFSC Code : SBIN 0020639

**విషయసూచిక** **పుట సంఖ్య**

మా వాణి ........ 2
త్యాగం అంటే ........ 6
పూర్ణ కుంభం ........ 8
కబీర్ భావ పరంపర ........ 11
తోటకు నీరు ........ 12
సాయి సేవక్-శ్రీ శివనేశన్ ........ 13
శాశ్వత ధర్మగోప్త ........ 16
సాయిభక్త దాసగణు ........ 19
శ్రీ సాయి నిత్య పారాయణ ........ 22
భక్తి ........ 24
ఆలోచించండి ........ 28
గురుపూర్ణిమోత్సవం ........ 29
రాగద్వేషాలు ........ 30


ఈ పత్రికలోని రచయితల అభిప్రాయాలు వారి వ్యక్తిగతమైనవి. పత్రిక యాజమాన్యానికి బాధ్యత లేదు.







# మా వాణి



## కడదాకా నీవెంటే

ఆవేళ ఏదో ఉత్సవం, చాలామంది భక్తులు వచ్చారు మసీదులో బాబా వారి దర్శనానికి. బాబా వారు స్వయంగా వండి వడ్డించారు వచ్చిన వారందరికీ. పైవాళ్ళు అందరూ సెలవు తీసుకొని వెళ్ళిపోయాక-సన్నిహిత భక్తులు ఓ పది పన్నెండు మంది మాత్రం మిగిలారు అందరూ కలిసి బాబా గారితోపాటు భోజనాదులకు కూర్చున్నారు. అందరూ ఉత్సవం బాగా జరిగిందన్న ఆనందంతో ఉత్సాహంగా ఉన్నారు. ఏవేవో కబుర్లు దొర్లుతున్నాయి. భక్తుల మధ్యలో బాబా వారు మాత్రం ఎప్పటిలాగే చిదానందంగా ఉన్నారు. తమకు అటు కూర్చున్న వారికీ, ఇటు కూర్చున్న వారికీ కూడా రొట్టెలు, మిఠాయిలు, కూరలు పంచుతూ వాళ్ల కబుర్లు వింటున్నారు. మాటల మధ్యలో ఒక భక్తుడన్నాడు.

"బాబా" మీతో కలిసి గడపటంలో మేము పొందుతున్న ఆనందం అంతులేనిది. మీతో కలవని జీవితాన్ని ఊహించుకోలేము. ఎప్పటికి మీ సన్నిధిన ఉండే వరం ఇవ్వండి మాకు.

ఆ మాటలకు వంత పలుకుతూ, "అవును బాబా మీరు లేని జీవితాలు మేము కలలో కూడా అనుకోలేము. ఎల్లవేళలా మీరు మాతోనే ఉండాలి- అన్నారు ఇంకొందరు. బాబా రొట్టె త్రుంపటం ఒక్క క్షణం ఆపి "నిజంగానా?" అన్నారు. కొంచెం పరిహాసం మేళవించిన కంఠంతో. అందరూ ఏక కంఠంతో "నిజంగానే బాబా" మీరు మా జీవితాల్లో ఒక ప్రధానమైన భాగం అయిపోయారు" అన్నారు. బాబా తల ఊపి, "అలాగా!" అని భోజనం చెయ్యసాగారు. ఒక్క రెండు, మూడు క్షణాలు అలా గడిచాయో లేదో -

ఫెళ ఫెళమంటూ శబ్దం వచ్చింది. పై నుండి అందరూ తలలెత్తి చూచారు మసీదు పై కప్పుకు ఆధారంగా ఉన్న దూలం విరిగిపోతోంది. సున్నం పెళ్లలుగా బీటలు విచ్చుతోంది. మరోసారి ఫెళఫెళమన్న చప్పుడు రాగానే ఎక్కడి వాళ్లక్కడ విస్తళ్లు విడిచిపెట్టి, మసీదు బయటికి పరుగెత్తుకు పోయారు ఏ ఒక్కళ్లుగానీ తమ సాటి వాళ్లను గురించి సరే - బాబా గురించి కూడా ఆలోచించలేదు దాదాపు ఇరవై మందిలోనూ మసీదులో మిగిలింది నలుగురే బాబా మహల్సాపతి, తాత్యా, శ్యామా, బాగోజీ, బాబా చెయ్యి పైకెత్తి "ఆగు! ఆగు! ఇంకా కాస్త సమయం ఉంది. కాస్త తగ్గు" అన్నారు. దూలం విరగడం, రాలడం ఆగిపోయింది. బాబా మామూలుగా తినసాగారు. ఇదంతా చూచి ధైర్యం తెచ్చుకున్న ఇతర భక్తులు కూడా తిరిగి వచ్చి భోజనాలు చేశారు. అందరూ చేతులు కడుక్కోవడానికి బయటికి వచ్చారు. బాబాగారు కూడా బయటకు వచ్చి మసీదు కప్పు వైపు చూచి - "ఊఁ! ఇక కానీ!" అన్నారు. మరుక్షణంలో మసీదు కప్పు కూలిపోయింది. భక్తులంతా మంటపంలో బాబా చుట్టూ కూర్చున్నారు. బాబా తాంబూలం నములుతూ, "చెప్పండయ్యా! ఎంతమంది వస్తారు, నాతో పాటు కడదాకా?" అని అడిగారు. ఆయన పెదవి కొసన, చిన్నకొంటె నవ్వు. నోరు మెదపబోయిన వారల్లా ఆగిపోయి, ప్రక్క వాళ్ళ వైపు చూశారు- కొందరు తలవంచుకున్నారు కొందరు. "పలకరే!" అన్నారు బాబా "బాబా అదీ! అనుకోకుండా అలా జరిగిపోయింది కానీ నిన్ను విడచి మేమేమి చేయగలం" అన్నారు నసుగుతూ. బాబా ఫక్కున నవ్వారు.

గురువును ప్రేమించడం, గురుబోధ ఆలకించడం, దాన్ని గురించి యోచించడం, దాన్ని ఆచరించడం, ఎన్ని కష్టాలు వచ్చినా గురు నిర్దేశిత మార్గాన్ని విడనాడకుండా ఉండడం అన్నవి అంత తేలికగా ఒంటపట్టవు. ఒంటపట్టవని పూర్తిగా అనలేము కానీ ఎప్పుడు మళ్లీ మాయలో పడిపోతూ ఉంటామో తెలియదు. మన పతనానికి ఏవేవో కారణాలు వెతుక్కుం





టాము, సమర్థించుకుంటాము. పైన చెప్పకున్న భోజనాల కథలో బాబాను వదిలివెళ్లకుండా నిర్భయంగా కూర్చున్న వారినే చూద్దాం. శ్యామా బాబా చేత సటకా దెబ్బలు కూడా తిన్నవాడు మహల్సా దుర్భర దారిద్ర్యాన్ని అనుభవించినవాడు. అందరికీ ఎన్నెన్నో దానధర్మాలు చేసిన బాబా అతనికి ఒక్క రూపాయైనా ఇచ్చేవాడు కాదు. పైగా ఎవరైనా వచ్చి ఇవ్వబోయినా వీల్లేదనేవారు. తాత్యా చిన్ననాటి నుంచి 'మామా' అంటూ ఆప్తబంధువు గానే భావించినవాడు. భాగోజీ కుష్ఠురోగాన్ని బాబా నయం చేసి తన నీడలోనే ఉంచుకున్నారు. నలుగురు నాలుగు విధాలా అనుభూతులను బాబా ద్వారా పొందినవారు. అయినా బాబా పట్ల వారికున్న ప్రేమ, ఆప్తత, విశ్వాసం పరమ ఘనిష్ఠమైనవి. అందుచేతనే మరణ ప్రమాదం ఏర్పడు తుందేమో అన్న పరిస్థితుల్లో కూడా బాబా నీడలోనే ఉన్నారు. కానీ విడిచి పెట్టి పారిపోలేదు.

అచ్చమైన శిష్యునికి గురువు ముందు తాను గుర్తురాడు తన గురువు తప్ప. తనకు కష్టాలకు, సుఖాలకు, మంచికి, చెడుకి అన్నిటికీ గురువే దిక్కన్న భావం శరణాగత తత్వం అతని జీవితంలో ఒక భాగమైపోతుంది.

అన్నాడు ధూర్జటి కాళహస్తీశ్వర శతకంలో అదిగో ఏది వచ్చినా "నా యోగ్యతకు తగిందే నాకు లభించిందే తప్ప అన్యమేమీ కాదు అన్న భావన కలుగుతుందే తప్ప గురువుండి కూడా ఏం చేసినట్లు అనే భావన రాదు". కాకాసాహెబ్ దీక్షిత్ ఏ కష్టానికీ నొచ్చుకోలేదు. తాను సంపాదించిన పెట్టెడు వెండి రూపాయలూ కూడా బాబాగారు దోసిళ్లతో దానం చేస్తుంటే నిర్లిప్తంగా చూస్తుండిపోయాడే తప్ప అదేమనలేదు. చివరికి తన కన్నబిడ్డ బాబా సన్నిధిలోనే మరణించింది. దీక్షిత్ భార్య బాబా మీద కోపం తెచ్చు కుంటే దీక్షిత్ మాత్రం "తన సొమ్ము తాను తీసుకొంటే నీకేమి" అన్నాడే తప్ప చలించలేదు. అలా ఉన్నవాడే అసలైన శిష్యుడు.

పైన ధూర్జటి అన్నట్లుగా మేలు కలిగినా, కీడు కలిగినా, కీర్తి కలిగినా,

అపకీర్తి కలిగినా, సంపత్తి కలిగినా, దారిద్ర్యమే కలిగినా అన్నీ ఆ స్వామి ప్రేమతో ఇచ్చిన కానుకలే అనుకోవడం అన్నది కష్టసాధ్యమే కాని అసాధ్యం మాత్రం కాదు. కానీ, మాయ మహా చమత్కారంగా వచ్చి ఆవరిస్తుంది మనిషిని. దాని ప్రభావానికి లోనై మనిషి ఎప్పుడు ఎలా పతనమౌతాడో చెప్పలేము. ఎప్పుడు గురుచరణం విడిచి గోతిలో పడిపోతాడో ఎరుక పడదు. అలా కాకుండా సుస్థిరభావంతో గురువుని అంటిపెట్టుకొని ఉన్నవాడే కడదాకా ఆ సేవలో ఉన్నవాడే పండగలడు, ముక్తిని అందగలడు. స్వయంగా బాబావారే చెప్పారు కదా ఒకసారి దామూ అన్నాకు! బాబా దగ్గరకు వచ్చిన వారంతా లబ్ధి పొందుతున్నారా? అన్న సందేహం దామూ అన్నాకు వచ్చింది. అప్పుడు బాబా ఒక మామిడిచెట్టును చూపిస్తూ "ఆ చెట్టు చూడరా దామ్యా! దానికి ఉన్న పూతంతా పళ్లుగా మారతాయా? కొంత పూత చిన్నపాటి గాలికే రాలిపోతుంది. మరికొంత భాగం పిందెలుగా మారాక పెద్దగాలికి రాలిపోతుంది. ఇంకొంత కాయలు ముదిరాక కూడా ఏ ప్రభంజనానికో నేలపాలౌతుంది. మిగిలిన కొద్దిపాటి కాయలు అంటే ఆది నుండి తుది వరకూ తొడిమెను అంటిపెట్టుకొని ఉన్నవి మాత్రమే పండి పరిమళిస్తాయి, మాధుర్యాన్ని అందించగలుగుతాయి" అన్నారు. బాబా చెప్పిన మామిడిపూత శిష్యులు వీరి నడక లోకానికి తల్లక్రిందులుగా కన్పిస్తుంది. బంధుమిత్రులు ఎడంగా పోతారు, భార్యాబిడ్డలు తమ ప్రాముఖ్యం తగ్గిపోతూ ఉందని గోలపెడతారు. సరిగ్గా సత్సంగ సమయానికి ఏదో ఒక అభ్యంతరం చెప్తారు.

బాబాగారి వాక్కు ఒకటి ఉండనే ఉంది కదా! "నన్ను ప్రేమించే వాడికి నేనే బంధాలన్నీ తెంచుతాను" అని అంచేత ఆప్తులైన వారు ఎందరో దూరం కావడం, ఉన్న సంపదలు కరిగిపోవడం, మరెన్నో బాధలు ఎదురౌతాయి.

వీటన్నిటికీ భయపడి పారిపోతూ ఉంటే అంచెలంచెలుగా రాలిపోయే మామిడిపూతలుగా మిగిలిపోతాం. అలాకాక తొడిమెను అంటి గురువు





పట్ల అచంచల విశ్వాసంతో చేసుకున్న ఆత్మార్పణ భావాన్ని వదిలి పెట్టకుండా అంటిపెట్టుకుని ఉన్నవారు మాత్రమే ధన్యులౌతారు, ముక్తులౌతారు.

అలా కావడానికి మనం సామాన్య మానవులం. ఎన్నెన్నో వైవిధ్యాల మధ్య, వైరుధ్యాల మధ్య సంఘర్షణ పడుతూ, గాలి వాలుకు కొట్టుకుపోయే అలవాట్లున్న వాళ్లం అందుచేత కనీసం నెలకొక్కసారి గురుచరణాల సన్నిధిన కూర్చుని సాధనలోని తన అగచాట్లు, పాట్లు చెప్పకొని మార్గోపదేశం తీసుకోవాలి. అందుకు అందనంత దూరంలో ఉంటే తాను మంత్రదీక్ష తీసుకొన్న రోజు, గురువు జన్మదినం నాడు, గురుపూర్ణిమ నాడు తక్కువలో తక్కువ ఏడాదికి మూడుసార్లు గురుదర్శనం చేసుకోవాలి. గురుదక్షిణ, దానితోపాటు ఆత్మార్పణ తప్పనిసరి చేసుకోవాలి.

# త్యాగం అంటే

**- మాతాజీ**

రాజాస్థానం అత్యద్భుతమైన దేశభక్తులకు పుట్టినిల్లు. చిత్తూరు రాజ్యం ఒకప్పుడు ప్రమాద పరిస్థితుల్లో పడింది. ఆ రాజ్యంపైన శత్రువులు దండ యాత్ర చేశారు. రాజ్యంలో ఎక్కడెక్కడ ఉన్న సైనికులు, సైనికాధికారులు, ఎక్కడెక్కడివారు వెంటనే రణరంగానికి దూకవలసిన అవసరం ఉన్నదనీ, వెంటనే బయలుదేరవలసినదని రాజాజ్ఞ వచ్చింది. అలాంటి రాజాజ్ఞ చూడావత్ సింహుడికి కూడా అందింది.

చూడావత్ సింహునికి వివాహమై ఒక వారమైంది. ఇంకా వధూ వరులు విహారాలలోనే ఉన్నారు. అలాంటి స్థితిలో ఈ రాజాజ్ఞ అతనికి పిడుగుపాటులాగా తగిలింది. "నవవధువైన భార్యను విడిచివెళ్లడమా? మాతృభూమి రక్షణను అలక్ష్యం చేయడమా? చూడావత్ సందేహంలో పడ్డాడు. ఒకపక్క అందాలభరిణంలాంటి భార్య మరోప్రక్క చేతులు చాచి సహాయం అర్థిస్తున్న మాతృభూమి. ఎటు వెళ్లాలి? యుద్ధంలో విజయమే

పొందుతాడో? మరణమే ప్రాప్తిస్తుందో? తెలియదు. చూడావత్ మనసులో కదిలే భావాలను అతని భార్య మధురాణి చదవగలిగింది.

"మీరు రాజాజ్ఞ ప్రకారం యుద్ధరంగానికి వెళ్లడం ఎప్పుడు?" అని ప్రశ్నించింది. "నా సెలవు రేపటిదాకా ఉంది. తర్వాత వెళతాను". కొంచెం అయిష్టంగా అన్నాడు చూడావతుడు. "దేశం ప్రమాదంలో పడినప్పుడు ఇలా కూర్చొని సుఖపడాలనుకోవడం అవివేకం. మన దేశమే నాశనమైతే మనం అనుభవించే సుఖం ఏమిటి? అన్నది మధురాణి రవంత తీవ్రంగా. చూడావతుడు ఏం మాట్లాడలేదు. భార్య మాటల్లోని సత్యం అతని మనస్సుకి తాకింది. చటుక్కున గుర్రం ఎక్కి రివ్వున యుద్ధరంగంవైపు దుమికాడు.

యుద్ధం జరుగుతున్నది. కాని చూడావత్ మనసంతా భార్య మీదనే ఉంది. పరాక్రమంతో చావో, రేవో అని తెగించి పోరాడలేకపోతున్నాడు. రెండు రోజుల తర్వాత విశ్రాంతి సమయంలో భార్యకు లేఖ వ్రాశాడు. ఆ మర్నాడు మరొకటి - అటుపైన మరొకటి.

మధురాణి ఆ లేఖలన్నీ చదువుకున్నది. తన మీది ప్రేమ వలన భర్త తెగించి పోరాడలేకపోతున్నాడని గ్రహించింది. కన్నీళ్లు ఆమె చెక్కిళ్లను తడిపాయి. దాంతోపాటే ఆమెలో కర్తవ్య దీక్షాగ్ని భగ్గున రగిలింది. ఒక సేవకుడిని పిలిచి ఒక వెండి పళ్లెం, ఖడ్గం తెమ్మని చెప్పింది. లేఖలు తెచ్చిన వాహకునితో ఇలా అన్నది.

"మీ సేనాధిపతి దగ్గరకు పోయి నేను నా బాధ్యత నిర్వహించానని చెప్పు. రసపుత్ర వీరుడిగా, రాజాజ్ఞను శిరసావహించిన రాజ భక్తుడిగా, మాతృభూమిని సంరక్షించుకోవలసిన ఒక పుత్రుడిగా, ఆయన కర్తవ్యాన్ని, ఆయన నిర్వర్తించాలని నేను కోరుకుంటున్నానని చెప్పు. అదే నా అంతిమ కోరిక". మరుక్షణంలో మధురాణి జై మాతృభూమి అని నినాదం చేస్తూ తన శిరస్సు తానే ఖండించుకుంది. ఆ దృశ్యం చూసిన సేవకులు





కంపించిపోయారు.

వాహకులు తన ముందు పెట్టిన వెండి పళ్లెంలోనే మధురాణి శిరస్సును చూచి చూడావతుడు నిశ్చేష్టుడయ్యాడు. ఆమె కడపటి కోరిక వినగానే ఆమె ఆత్మాహుతిలోని అంతర్యం అతనికి అర్థమైంది. వెంటనే ఒకచేత భార్య శిరస్సును, మరోచేత ఖడ్గాన్ని ధరించి చూడావత్ కదనరంగంలో కదం తొక్కసాగారు. ఆయన వీరవిహారం ముందు అశేష శత్రువులు నేల కూలారు. అలా పోరాడుతూనే చూడావత్ వీరస్వర్గాన్ని అలంకరించాడు.

# పూర్ణ కుంభం

**- బుద్ధ జాతక కథలు ఆధారంగా**

ఒకప్పుడు సర్వమిత్రుడనే రాజు చక్కగా రాజ్య పరిపాలన చేస్తుండే వాడు. అతని చుట్టూ ఎలాగో దుష్ట మిత్ర బృందం చేరింది. మెల్లగా ప్రభువు మద్యపానానికి అలవాటు పడిపోయాడు. కొంతకాలానికి మద్యపాన లోలుడైపోయాడు కూడా. రాజ్య వ్యవహారాలు పట్టించుకోవడం మాని వేశాడు. కొద్ది సంవత్సరాలు తిరిగే సరికి యథారాజా తథాప్రజా అన్నట్లుగా ప్రజలు కూడా మద్యపాన శీలురై పోయారు. ఇదంతా గమనిస్తున్నాడు బోధిసత్త్వుడు. అప్పట్లో ఆయన ఇంద్ర పదవిలో ఉన్నాడు. సద్ధర్మపరుడైన ఒకరాజు ఇలా పతనం చెందడం అతని అడుగుజాడలలో ప్రజలంతా గోతిలో పడిపోవడం చూచి ఆయన మనసు ఎంతో వ్యధ చెందింది. "ప్రజలకు తమ నాయకులు చేష్టలు అనుకరించడం సహజ స్వభావం. కనుక ముందు రాజుకు చికిత్స చేస్తే ప్రజలు వాళ్లే చక్కబడతారు" అనుకొని ఆయన మానవరూపం ధరించారు. రాజ్యసభకు వచ్చారు. ఆ సమయంలో రాజుగారు, మంత్రులు రాజకార్యాలను గూర్చి ఆలోచించడం లేదు. మధువులో ఉండే రకాల గురించి, వాటి రుచి గురించి, హెచ్చుతగ్గుల గూర్చి చర్చించుకుంటున్నారు. కరిగిన బంగారపు వన్నెను పోలిన శరీరం,

జడలు కట్టిన జుట్టు, లేడి చర్మం చుట్టుకొని ఒక చక్కని పూర్ణకుంభం చేత బట్టుకొని వచ్చిన బోధిసత్వుడుని చూసి ఆశ్చర్యపోయారు. ఆయన చేతిలోని పూర్ణకుంభం చక్కని చిగురుటాకులతో, పరిమళ పుష్పాలతో అలంకరింపబడియున్నది.

"స్వామీ! తమరెవరు? ఎక్కడ నుండి వస్తున్నారు? మీ కాంతి, వేషం అన్నీ ఋషీశ్వరుని తలపిస్తున్నాయి" అని అడిగాడు రాజు. "నేనెవరో తరువాత తెలుసుకుందువుగాని ముందు ఈ పూర్ణకుంభం కొంటావా? అది చెప్పు. మీకు నరక భయం లేకపోతే, పై జన్మకు పాపం వెంట వస్తుందన్న భయం లేకపోతే దీన్ని కొనడానికి ముందుకు రావయ్యా" అన్నాడు బోధిసత్వుడు. "ఇది ఆశ్చర్యంగా ఉందే! వస్తువుని అమ్మేవాళ్ళు దాని గుణగణాలు అనంతంగా వర్ణిస్తారు. మీరు వ్యతిరేకంగా చెప్తున్నారే! ఇంతకీ అందులో ఏమి ఉన్నది? దాని ధర ఎంత?" అని అడిగాడు రాజు.

బోధిసత్వుడు నవ్వి "ఇందులో పుణ్య తీర్థం జలం లేదు. పరిమళాలు వెదజల్లే తేనె లేదు. ఆయుష్షును పెంచే నెయ్యి లేదు. ఇందులోని పాలు కావు. పాపమయమైన ద్రవం ఉంది దీనినిండా. దీని ప్రభావమంటారా దీని సేవించిన తరువాత సమతల ప్రదేశాల్లో కూడా అడుగులు తడబడి స్వాధీనం తప్పిపడవచ్చు. జ్ఞాపకశక్తి నశింపజేసుకోవచ్చు. ఏది తినవచ్చో ఏది తినకూడదో అన్న జ్ఞానం విడిచిపెట్టి చేతికందినవి మెక్కవచ్చు, అంత మహిమ గల ద్రవం ఉంది ఈ కుంభంలో.

ఒక్కసారి దీన్ని చవిచూచారా మీ మనస్సు అదుపు తప్పతుంది. చక్కగా కుప్పిగంతుల నాట్యం చెయ్యగలరు. దానికితోడు అర్థం లేని సంగీతం కూడా పాడవచ్చు. లోకుల ముందు నవ్వుల పాలు కావచ్చు. అంతదానికి ఎందుకు! సిగ్గు లజ్జ విడిచిపెట్టి పదిమందీ తిరిగే వీధుల్లో నగ్నంగా తిరిగొచ్చు కూడా. మరికాస్త ఎక్కువ పుచ్చుకుంటే ఒళ్లంతా వాంతులు చేసుకొని రహదారి మీదైనా స్పృహ తప్పిపడిపోవచ్చు. ఒంటికి





అతికిన ఆ వాంతి నాకటానికి వీధికుక్కలకు ఆహ్వానం కూడా పలకొచ్చు.

దీని మహత్తు ఇంకా వినండి. పూర్వం వృష్ణి, అంధక జాతుల ప్రజలు దీన్ని తాగే ఒళ్లు తెలియక పరస్పర చుట్టరికాలు కూడా మర్చిపోయి ఒకరి కొకరు కొట్టుకొని చచ్చి ఊరుకున్నారు. అటువంటి అద్భుత ద్రవం ఇది. ఇంకా వచ్చి కొనండి. కాళ్లూ, నాలుకా వశం తప్పిపోవడానికి నిగ్రహం లేకుండా వికవికా నవ్వడానికి, గావురుబావురుమని ఏడవడానికి కూడా ఇంకా అద్భుతంగా పనిచేస్తుంది. అంతే కాదు దీనికి లొంగి లక్ష్మీ నివాసాల్లాంటి ఇళ్లు స్మశాన వాటికలుగా మార్చుకున్న శ్రీమంతులెందరో ఉన్నారు. అంత గొప్ప ద్రవమిది.

"అసత్యాన్ని సత్యమేనని గట్టిగా వాదించదల్చుకున్నారా! అయోగ్యమైన పనిని యోగ్యమైన దానిగా భావించి చేయదల్చుకున్నారా! మంచిని చెడుగా, చెడుని మంచిగా భ్రమించదల్చుకున్నారా? పూజ్యులైన తల్లిదండ్రు లను ప్రేమాస్పదులైన భార్యాబిడ్డలను, గౌరవనీయులైన పెద్దలను బూతులు తిట్టదల్చుకున్నారా! పోనీ కొట్టదల్చుకున్నారా! ఇవన్నీ మతి ఉన్న వాడెవడు చెయ్యలేడు. అంచేత మతిని పోగొట్టగల ఈ ద్రవం కొని త్రాగండి. శీలాన్ని, కీర్తినీ నాశనం చేస్తుంది ఇది. మనస్సును మలినం చేసి ప్రతి మంచి గుణాన్ని అవగుణంగా మార్చేస్తుంది. అటువంటి ఈ ద్రవాన్ని తీసుకో మహారాజా! మనసారా త్రాగు. పై ఫలితాలన్నీ అనుభవించు". బోధిసత్వుని మాటలు విని రాజు నిర్ఘాంతపోయాడు. వెంటనే లేచి ఆయన చెంతకు వచ్చి "అయ్యా! తమరెవరో తండ్రి బిడ్డకు, గురువు శిష్యునికి చెప్పినట్లుగా నాకు చక్కని హితవు చెప్పారు. మీకు ఋణపడి ఉంటాను. తమరికేం కావాలో ఆజ్ఞాపించండి" అన్నాడు. అందుకు బోధిసత్వుడు అతనిపై కరుణా కటాక్షాలు కురిపిస్తూ "నాకేమీ వద్దు. హితవు చెప్పిన వానిని గౌరవించే పద్ధతి ఏమిటంటే ఆ హితోక్తిని ఆచరించటమే. ఆ పని చేసి నిన్నూ, నీ ప్రజలను కూడా కాపాడుకో" అని వెళ్లిపోయాడు. ఆనాటినుండి సర్వ మిత్రుడు మద్యపాన జాడ్యాన్ని వదిలించుకొని నిజంగా సర్వ మిత్రుడైపోయాడు.

# కబీర్ భావ పరంపర

జహాఁ కామ్ తహాఁ నామ్ నహీఁ, జహాఁ నామ్ నమిఁ కామ్

దోనఁ కబహూ న మిలేం రవిరజని ఏక్ఇ ఠామ్

కామ వాసన ఉన్నచోట భగవంతుని నామ సంకీర్తన స్వచ్ఛంగా ఉండదు. భగవన్నామం నిర్మలంగా పలుకబడే చోట కామ వాసన ఉండదు. మోహము భగవత్ప్రేమ ఒకేచోట ఉండడం అసంభవం. రాత్రివేళ సూర్యుడుంటాడా? సూర్యకాంతి వచ్చాక చీకటి నిలవగలదా? అలాగే ఈశ్వరుని జ్ఞాన ప్రకాశంలో అజ్ఞానం నశించిపోతుంది.

“రాముడు కాముడు ఒక్కచోట ఎలా ఉంటారూ?” అనే వారు శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామి వారు. విషయ కాంక్షలు నిండియున్న మనస్సులోకి ప్రవేశించడానికి భగవంతుడి వలన కూడా కాదన్నమాట. మరి ఈ విషయ వాసనలు పోగొట్టుకోవడం ఎలాగా అంటే ఒకే ఉపాయం దానికి. నిరంతరము మొదట్లో బలవంతంగానైనా సరే మనస్సుకి భగవన్నామ సంకీర్తన అలవాటు చెయ్యడమే. మెల్లమెల్లగా అంటారు కబీరు. నిజమే - మామూలు మనుష్యులమైన మనమే శుభ్రత లేని చోట ఉండం గదా! ఇక శుచి స్వరూపుడైన పరమాత్ముడు మనసులో ఉండాలంటే - ఆ మనసంతా ఎంత ఖాళీగా, పరిశుద్ధంగా ఉండాలి. కబీరే అన్నారింకొకచోట - నీళ్లతో ఒళ్లు కడిగీ కడిగీ కష్టపడుతున్నావు సరే- “మన్ కేమైల్ ఉతార్, ఉతార్ రే!” మనసులోని మురికి పోగొట్టుకోవయ్యా! అని

బాహర్ క్యాదిఖరాయియే, అంతర్ జపియే రామ్ ।

కహాకాజ్ సంసార్ సే, తుఝే ధనీ సే కామ్ ॥

భగవంతుని స్మరణ బయటకు కనిపించేలాగా ఆడంబరంతో చేసి ఏం లాభం? నిర్మలచిత్తంతో అంతర్యంలో చేస్తూ ఉండు. ఈ ప్రపంచం





పట్ల నీకేమి శ్రద్ధ ఉంటుంది. నీక్కావలసింది భగవంతుడు అంటే సమస్త విశ్వాన్ని సృజించిన వాడు పరమాత్ముడే. ఆయనే దీని అంతటా వ్యాపించి యుంటాడు. ఆయన స్మరణని అత్యంత సహజంగా క్షణక్షణం నిరాడంబరంగా జరుపుకుంటూ ఉంటే ఆయన ఎల్లవేళలా నీతోనే ఉంటాడు.

మనం ఎన్ని మాలల జపం చేశామో, ఎన్ని శ్లోకాలు వల్లించామో, ఏ సహస్ర నామం ఎన్ని పారాయణాలు చేశామో అది ముఖ్యం కాదు. శ్లోకాలు వల్లించడం వలన, భజనలు చేయడం వలన పారాయణల వలన మాత్రమే మోక్షం వచ్చేటట్లయితే టేప్‌రికార్డర్లకి, లౌడ్‌స్పీకర్లన్నిటికీ మోక్షం రావాలి. పదిమందిలో ఆడంబరం కోసం భక్తులమనిపించుకోవడం కోసం లేదా స్వరాలాపనలో ఆనందించడం కోసం కాక అంతర్జ్యోతిని దర్శించడం కోసం నిరాడంబరంగా చేసేదే అసలైన నామస్మరణ. అది అలవడిన నాడు ప్రపంచంలోని ప్రతి జీవిలోనూ పరమాత్ముడే కనిపిస్తాడు. మిగిలిన - అంటే బాహ్యరూపాలకు విలువనశించిపోయి లక్ష్యాన్ని చేరగలుగుతాము.

# తోటకు నీరు

ఒక పొలము కాపు రోజంతయు చెఱకు తోటకు నీరు పెట్టుచుండెను. పని ముగియగానే అతడు పరిశీలింపగా ఒక చుక్కైనను నీరు పొలమున కెక్కలేదు. నీరంతయు దూరమున కొన్ని ఎలుక కన్నములలో నుండి బయటకు పోయెను. భగవంతునారాధించుచున్నను ఐహిక విషయము లందును పేరు ప్రతిష్ఠలయందును ఆసక్తుడై యుండు భక్తుని స్థితి కూడ అట్టిదే. యావజ్జీవము ఉపాసన చేయుకాక తుదకెంత మాత్రము శ్రేయోభివృద్ధి నొందలేదని తనకే విశదమగును. అతని సాధనలన్నియు ఈ కామ్యములను ఎలుక కన్నములలోనికి పోయి బూడిద గలసిన పన్నీరగును.

## సాయి సేవక్

# శ్రీ శివనేశన్ స్వామీజీ జీవిత చరిత్ర

**(గత సంచిక తరువాయి)**

షిరిడీలో నివసించే శ్రీమతి పల్లవిషా స్వామీజీ సశరీరులుగా నున్నప్పడు స్వామీజీతో ప్రతిరోజు గురుస్థానానికి ప్రదక్షణలు గావించెడిది. స్వామీజీ మహాసమాధి చెందిన తరువాత కూడా ప్రదక్షిణలు చేస్తుంటే ఈమెకు కొద్దిదూరం ముందుగా స్వామీజీ ప్రదక్షిణలు చేయుచు దర్శన మిచ్చెను. స్వామీజీ తన శరీరమును త్యజించినను తన దినచర్యను ఎప్పటి వలె కొనసాగిస్తున్నారని యీ ఘటన తెలియజేయుచున్నది.

శ్రీ పి.యస్.రావు, షిరిడీ, వారి గృహములో పూజా మందిరములో దేవతా చిత్రపటాలతోపాటు స్వామీజీ మరియు ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి చిత్రపటాలను పూజించెడివారు. వీరింటికి వచ్చిన ఒక మహిళ భగవంతునితో సమానంగా స్థానం కల్పించి ఈ మానవమాత్రులను ఎందుకు పూజిస్తున్నారని రావుగారి అత్తగారైన శ్రీమతి రాఘవరపు రమాదేవి గార్ని ప్రశ్నించగా ఆమె ఆ రెండుపటాలను పూజా మందిరము నుండి తొలగించెను. ఆనాటి రాత్రే స్వామీజీ ఆమెకు స్వప్న దర్శనమిచ్చి ఆమెను షిరిడీలో గల అన్ని మందిరములను దర్శింపజేసారు. దీనితో ఆమె స్వామీజీ సామాన్య మానవుడు కాడని గ్రహించి ఆ చిత్రపటాలను తిరిగి యథాస్థానంలో ఉంచి పూజించసాగెను.

శ్రీమతి పి.భారతలక్ష్మి (ఇం.నెం.5-65/1, న్యూ మారుతీ నగర్, హైదరాబాద్-500 060)గార్కి 17.02.1996న స్వామీజీ అవధూత నాంపల్లి బాబాతో కలసి స్వప్న దర్శనమిచ్చి "నాకు బట్టలు పెడతావా?"యని అడగగా ఆమె "పెడతాను స్వామీ" యని సమాధానమిచ్చి స్వామీజీ ఆజ్ఞను శిరసా వహించి గురుపూర్ణిమ రోజున మల్లాపూర్ బాబా మందిర ప్రాంగణంలో





స్వామీజీ ధ్యానమందిరంలో నూతన వస్త్రాలను సమర్పించెను.

ఆదిలాబాదులో గల హార్టీకల్చర్ డిపార్టుమెంటులో పనిచేస్తున్న రవి గారు కల్లూరు శ్రీ దత్త వెంకట సాయి ఆలయానికి వెళుతూంటే కల్లూరుకు సుమారు 20 కి.మీ దూరంలో స్వామీజీ చేతిలో రుద్రాక్షమాలతో దర్శనమివ్వగా అతను "ఇక్కడున్నారేమిటి స్వామీజీ?"యని అడుగగా స్వామీజీ "నా పని నేను చేసుకుంటున్నాను, నీ పని నీవు చేసుకో, కల్లూరు వెళ్ళు" అని సమాధానమిచ్చారు. ఈ సంఘటన స్వామీజీ సమాధి చెందిన తరువాత జరిగింది.

స్వామీజీ సశరీరులుగా నున్నప్పడు నిత్యం ద్వారకామాయి ఎదురుగా గల షాపులో నారికేళములు, ధుని సామాగ్రి కొని ధునికి సమర్పించెడివాడు. స్వామీజీ సమాధి చెందిన సుమారు పది రోజుల తరువాత ఆ షాపులో పనిచేసే అన్సర్‌కు స్వప్నములో అగుపించి ఎప్పటివలెనే కొబ్బరి కాయలు, ధుని సామాగ్రి తీసుకొనెను. స్వప్నమందే అన్సర్ స్వామీజీ సమాధి చెందినారు గదా షాపుకు ఎలా వచ్చారు అని తన మనస్సులోనే అనుకొనెను. వెంటనే స్వామీజీ "నేను ఎక్కడకు వెళ్ళలేదు ఎప్పుడు ఇక్కడే ఉంటాను అని చెప్పారు".

స్వామీజీ సమాధి చెందినాగాని తన దైనందిన కార్యక్రమములో ఏ విధమైన మార్పు లేదనియు ఆయన సాయి సేవ నిరంతరము నిర్విఘ్నంగా కొనసాగుతూనే ఉంటుందని మనము గ్రహించవలెను.

డా॥ నాసా ఆనందరావుగారు విశాఖ స్టీల్‌ప్లాంట్‌లోని హాస్పిటల్‌లో ఐ స్పెషలిస్టుగా పనిచేయుచుండిరి. వీరికి 11.02.1996 తేది రాత్రి స్వామీజీ స్వప్న దర్శనమిచ్చి అతనికి శ్రీ సాయి లీలామృతమును బహూకరించి దీనిని పారాయణ చేయి నీకు మేలు జరుగుతుంది అని చెప్పినారు. అటు పిమ్మట సాయిబాబా పక్ష పత్రికలో స్వామీజీ మహాసమాధి చెందిన విషయం చదివి ఆశ్చర్యపోయారు ఆనందరావుగారు.

ఇండోరుకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి మత్తు పానీయములకు

బానిసై వ్యాపారములో విపరీతముగా నష్టపోయినాడు. ఇండోరుకు చెందిన కొంతమంది బాబా భక్తుల ద్వారా స్వామిని గురించి తెలుసు కొని 1988లో స్వామిని దర్శించుకొనెను. స్వామీజీ ఆశీర్వాదము వల నను స్వామీజీ సలహాను త్రికరణశుద్ధిగా పాటించి చెడు అలవాట్ల నుండి బయటపడి వ్యాపారంలో అభివృద్ధి సాధించి సుఖముగా ప్రశాంత జీవ నము కొనసాగించెను. స్వామీజీ మహాసమాధి అనంతరము ఏ విపత్తు సంభవించినను స్వామిని ప్రార్థించగా వెంటనే ఆ విపత్తు నుండి బయట పడెడివాడు.ఈయన స్వామీజీ నా గురుదేవులు, నా జీవనగమ్యానికి మార్గ దర్శకులు, నన్ను బాబా బాటలో నడిపించిన మహనీయుడు అని చెప్పెను.

స్వామీజీ అంత్యక్రియలు జరిగిన తరువాత ఒక వ్యక్తి స్వామి అస్తికలను దొంగిలించి తన గృహమునందుంచుకొనెను. కొద్దిరోజులు గడచిన పిదప ఆ వ్యక్తికి సద్గురు నిత్యానంద స్వామీజీ స్వప్నములో అగుపించి "ఆ మహ నీయుని అస్తికలను ఎందుకు దొంగిలించావు? వాటితో నీకేమి పని" అని ఆగ్రహముతో ప్రశ్నించగా అతను తన తప్పిదనమును గుర్తించి ఆ అస్తికలను శాస్త్రోక్తముగా గంగానదిలో నిమజ్జనము గావించెను. ఈ సంఘటన యోగుల మధ్యన గల సంబంధము వారి దివ్యశక్తులను తెలియజేయుచున్నది.

**స్వామీజీ జీవితంలో కొన్ని ముఖ్య విశేషాలు :**

స్వామీజీ జనన, మహాసమాధి తేదీలు రెండూ 12వ తేదియే (సంఖ్య బాబా ద్వాదశాక్షరి మంత్రం 'ఓం సాయి శ్రీ సాయి జయ జయ సాయి'ను సూచిస్తోంది) గాక వారి జననం బాబాకు అత్యంత ప్రీతికరమైన శ్రీరామ నవమి కావటం మరొక విశేషం. బాబా మహాసమాధి చెందిన మంగళ వారమే స్వామీజీ జన్మదినం. బాబా మహాసమాధి చెందిన తరువాత 8 సం.లకు స్వామీజీ జన్మించటం మరొక విశేషం కాగా బాబా ప్రథమంగా షిరిడీ పుణ్యభూమి మీద కాలిడిన శతాబ్దికాలానికి (1953) స్వామీజీ కాలిడినారు. బాబావలెనే స్వామీజీ కూడ షిరిడీ సరిహద్దులు దాటి వెళ్లటానికి ఇష్టపడే వారు కాదు.

**(సశేషం)**





శ్రీ కృష్ణావతారం

# శాశ్వత ధర్మగోప్త



**- రచన : భండారు సదాశివరావుగారు**

**(గత సంచిక తరువాయి)**

ఆతతాయితనం ఎప్పడూ మృత్యువును స్వాగతించడమే నమ్మా, నరకుడు చేసిన దుర్మార్గాలకు ఎన్ని గుండెలు ఎన్నాళ్ళుగా తల్లడిల్లుతున్నాయో! అతని కొరకు ఎక్కువ దుఃఖించినా లాభం లేదమ్మా! ముందు జరుగవలసిన పనులనాలోచించండి. నీ సుతునికి రాజోచితంగా అంత్యక్రియలు జరగాలి. అతని కుమారుడు భగదత్తునికి పట్టాభిషేకం జరగాలి! ప్రభువు లేని రాజ్యం ఉండరాదు. ఇకనైనా ధర్మబద్ధ రాజ్యం నెలకొల్పబడాలి కదా!'

భూదేవికి, భగదత్తునికి ప్రాణం వచ్చినంత అయింది. గెలిచినా తనకేమీ వద్దనే ఈ మహాపురుషుడు నిజంగానే ధర్మరక్షకుడు.

ఇంతలో దూరంగా స్త్రీల వేలాది గొంతుకలలోంచి జయజయ ధ్వానాలు వినిపించాయి.

**'హే కృష్ణ! గోవింద! హరే మురారే**

**హే నాథ! నారాయణ! వాసుదేవ'**

(ఈ నరకసుతుణ్ణి, భీతహృతుణ్ణి, నీ పదపద్మాల దాపుకు తెచ్చాను ప్రభూ! పదాశ్రితులైన వారిని రక్షించేవాడివి. ఇతణ్ణి కాపాడు. నీ పద్మహస్తాన్ని అతని శిరసున ఉంచి ఆశీర్వదించు)

ఆ భక్తి నినాదాలతో ఆకాశం మారుమ్రోగింది.

ఆ సాయంకాలానికే నరకుని అంత్యక్రియలు జరిగాయి. శ్రీకృష్ణుని ప్రబోధంతో శ్రోత్రియులు జరుగవలసిన కర్మలు విధాయకంగా జరిపారు. నగర ప్రజలు కూడా దహనస్థలికి వచ్చారు.

'మరణాంతాని వైరాని' అని పూర్వులన్నారు. మీ నాయనగారు జరిపిన

అత్యాచారాలలో నీకూ భాగమున్నది. ఈ నృశంసమైన పరిపాలనను, ఇంత మంది ఆడువారిని కట్టుబానిసలుగా చేసిన విధానాలను పూర్తిగా వదులుకోవాలి. ఈ తాపసులు, ఈ శ్రోత్రియులు తమతమ అనుష్ఠాన విధానాలను, అధ్యయనాధ్యాపనాదులను నిర్విఘ్నంగా, స్వేచ్ఛగా, శ్రుతిసమ్మతంగా నడుపుకునే వ్యవస్థను పాదుకొలపాలి. ప్రజలకు రాజుకాక మరెవరయ్యా అభయమిచ్చేది. నీవూ నీ నాయన మార్గాన్నే అనుసరిస్తావనుకోను' అని భగదత్తుణ్ణి రాజ్యాన్ని వ్యవస్థీకరించుకొమ్మని ప్రోత్సహించాడు. 'భగదత్తా! నిత్యజీవనంలో ధర్మాధర్మ విచికిత్స వస్తుంది. అది తప్పకాదు. అప్పడే నిగ్రహవ్రతులు, యుక్తాయుక్తములు తెలిసినవాళ్ళు, ధర్మకాములూనైన శ్రోత్రియుల ఉపదేశాలు అవసరమవుతాయి. వాళ్ళు నిరపేక్షులు. కనుక వారి తాపసవృత్తికి రాజ్యం అడ్డుపడరాదు. రక్షణ చేకూర్చాలి. పోషణకై వారికి దాతలిచ్చిన సదుపాయాలకు భద్రత చేకూర్చాలి. వారికి మమకార వికారాలుండవు. ప్రజలు వారిని చూచి తమ ఆచరణను సవరించుకుంటారు. వారు ధార్మిక జీవనులు. ధర్మ వాఖ్యాతలు' అని నచ్చచెప్పాడు.

నరకాసురుణ్ణి కృష్ణుడు సంహరించే సమయానికే ఉద్ధవుని నేర్పరితనంవల్ల లోహితతీరంలో పంచజనుణ్ణి, విరూపాక్షుణ్ణి, అతని అనుచరులను సంహరించి, పదహారువేల మందికి పైగా సగం ప్రాణాలతో బ్రతుకుతూన్న స్త్రీలను నరకుని చెర నుండి విముక్తం చేశారు. సాత్యకి, వైనతేయుడు, మణిమానుడు నిశంభుణ్ణి, హయగ్రీవుణ్ణి అనుచర సమేతంగా పరిమార్చారు.

నరకుని అంత్యేష్టి జరిగిన తరువాత, భూదేవిని తీసుకొని, సత్యభామ, లోహితలోయలో పదహారువేల స్త్రీల నివాసాలున్న చోటికి వెళ్ళింది. వారందరూ జీవచ్ఛవాల్లా ఉన్నారు. కండ్లలో ప్రాణాలు నిలుపుకుని బ్రతుకుతున్నారు. దైన్యం వారి ముఖాల తాండవమాడుతున్నది. తల్లిదండ్రుల నీడన భర్తల, బంధులోకం మధ్యన-లలిత లావణ్యమూర్తులుగా, శీలవతులుగా జీవిం





చిన ఆ స్త్రీలు కళావిహీనలు-నిరాశ్రయులు.

సత్యభామ వారిని ప్రేమతో ఓదార్చింది. వారికి అభయమిచ్చింది. అక్రూర ఉద్ధవుల ఉపదేశంతో వారి హృదయాలలో శ్రీకృష్ణునిపై నిర్వ్యాజ భక్తి నెలకొన్నది. 'మీరు మీ మీ ఇండ్లకు చేరే సదుపాయాలు రేపే ప్రారంభమవుతాయి. పరిసర జనపదాలతో నరకాసుర వధను గురించిన వార్తను శీఘ్రగతిని చాటింపు చేయించడం జరిగింది. మీ కుటుంబ పెద్దలు రావచ్చు. వారితో మీ మీ స్వస్థలాలకు వెళ్ళే ఏర్పాట్లు జరుగుతాయి' అని సత్యభామ వారికి నచ్చచెప్పింది.

ఆ స్త్రీలలో చలనం కన్పించలేదు. అందరూ ఏకకంఠంతో 'మా రక్షకుడు, మా ప్రభువు త్రాత, ఆ వాసుదేవుని సందర్శనం ఎప్పడు జరుగుతుందమ్మా' అని 'హే కృష్ణా, హే కృష్ణా' అంటూ ధ్యానస్థులైనట్లు కండ్లు మూసుకున్నారు. సత్యభామకుగాని, భూదేవికిగాని, ఉద్ధవ అక్రూరులకు గాని మిగతా వారికి గాని ఏమీ తోచలేదు. పల్కరిస్తే పుల్కు పుల్కున దుఃఖపు పొంగు పొరలి వస్తున్నది. ఇన్నాళ్ళు లోలోపల భయంతో, నిస్సహాయంగా కండ్ల నీళ్ళు కూడా ఇంకిపోయేంతగా దుఃఖించిన ఆ నారీ బృందానికి ఏ మాటలు ఓదార్పు కదిలిస్తవో ఎవరికీ తోచలేదు.


అప్పటికే అర్ధరాత్రి దాటింది. వెంట వచ్చిన కొద్దిమంది శ్రోత్రియుల ద్వారా మళ్ళీ కలుసుకుంటామని, ఇక విశ్రమించమని నచ్చచెప్పి, తమ వసతికి అందరూ చేరుకున్నారు.

శ్రీకృష్ణుడు సత్యను ఆప్యాయంగా పలకరించాడు 'ఏమంటున్నారు ఆ బాధితురాండ్రు'.

సత్యభామ గడుసరి కదా! 'ప్రభూ! వాళ్ళు బాధితురాండ్లెందు కవుతారు. మీరు వారికి రక్షకులైన వెంటనే వారి బాధలు తొలగిపోయాయి'.

'సత్యా! మీ నాయనగారి వాక్చాతుర్యం నీకు నూరుపాళ్ళు అబ్బింది సుమా!"

**(సశేషం)**



# సాయిభక్త దాసగణు

రచన : విజయ కిషోర్

(గత సంచిక తరువాయి)

వాస్తవానికి అలానే జరిగింది. దాసగణు బాబాను ఆశ్రయించిన క్షణం నుండి అంతా తామై శ్రీ సాయి దాసగణును పారమార్థికంగా ఎంతో ఉన్నత స్థితులకు తోడ్కొని వెళ్ళిన వైనంలో, దాసగణు తన సొంత ఆలోచన మేరకు, తాను పట్టుబట్టి తాను అనుకున్న రీతిలో, తానే స్వయంగా నిర్దేశించుకున్న మంత్రాన్ని ఉపదేశంగా పొందిన ప్రక్రియ యొక్క ప్రాముఖ్యత ఏపాటిదో మనకు సులభంగానే బోధపడుతుంది. పిల్లవాడు బడికి వెళ్ళి విద్యాబుద్ధులు నేర్చుకొని సమాజంలో సముచిత స్థానం సంపాదించుకోవడంలో బడికి వెళ్ళేందుకు బిడ్డడు కోరుకున్న తాయిలాన్ని తల్లి ఇవ్వడం వంటిదే దాసగణు పొందిన మంత్రోపదేశం! బహుశః దాసగణు మంత్రోపదేశాన్ని తమకు అన్వయిస్తారనే బాబా, దాసగణు తమను ప్రత్యక్షంగా దర్శించుకోవడానికి ముందే-బ్రాహ్మణుని అయిన తనకు బ్రాహ్మణోత్తముడే మంత్రోపదేశం చేయాలనే ఛాందస భావం దాసగణు హృదయంలో బలంగా వేళ్ళూనికొనిపోయిన నేపథ్యంలో-వామనశాస్త్రి ద్వారానే దాసగణు కోరుకున్న తంతును జరిపించేసారు. తద్వారా తమ చరణాలను ఆశ్రయించిన తరువాత వాటి అవసరం లేదని తేల్చి చెప్పారు సరి!

దాసగణు శ్రీ సాయి ఆదేశాన్ని అనుసరించి ఉద్యోగం వదలివేసి, సాయి చరణాలకు శరణు చెందిన క్షణం నుండి దాసగణు జీవితంలో చోటు చేసుకున్న దైవ (సం)ఘటనల మాధ్యమంగా దాసగణుకి కలిగిన ఆధ్యాత్మిక అనుభవాలు అనన్య సామాన్యం మరియు ఆద్యంతం సద్గురు కృపా రసదాయకం. అడుగడుగున శ్రీ సాయి సమర్థతకు దర్పణం పట్టే ఆ సంఘటనలను అందించే అక్షర పంక్తుల వెంట హృదయాన్ని చక్షువులు





తోడ్కొనిపోతున్నప్పుడు కలిగే అపూర్వమైన ఆనందాన్ని పొందడానికి అత్యంత సావధానంతో సంసిద్ధులవమని పాఠక దేవుళ్ళకు మనవి. అపార కృపానిధి దాగియున్న శ్రీ సాయి లీలాంబుధిలో తనవితీరా మునకవేయడానికి కలంతో కలిసిప్రయాణించుదాం... పదండి.

బాబా ఆజ్ఞ ప్రకారం చివరకు ఉద్యోగానికి రాజీనామా చేసి బాబా దర్శనానికై శిరిడీ వచ్చాడు. "బాబా, మీరు చెప్పినట్లే ఉద్యోగాన్ని వదలి వేసాను. ఇకముందు నా పరిస్థితి ఏమిటి?" అని కొంచెం ఆందోళన నిండిన స్వరంతో అడిగాడు. అప్పుడు బాబా చాలా అనునయంగా "గణూ, భగవంతుడు అండగానుండగా ఎందుకు ఆందోళన చెందుతున్నావు? నీవు ఇకనుండి నాందేడ్‌లో ఉండు. నీకు అక్కడ అన్నీ ఏర్పాట్లు చేసాను" అని అన్నారు. "బాబా ఈ నాందేడ్ ఎక్కడ ఉంది? పూనాకు దగ్గరలోనా?" అని దాసగణు కుతూహలంగా ప్రశ్నించాడు. "ఛ, అదికాదు, జాల్నాకు అవతల వస్తుంది. అక్కడకు వెళ్ళు!" అని బాబా అజ్ఞాపించారు.

అలా, బాబా ఆజ్ఞ ప్రకారం దాసగణు మొదటిసారి నాందేడ్ ప్రాంతానికి వచ్చారు. పూర్వకాలంలో దాసగణుకి శిక్షకుడిగా నుండి తరువాతి రోజులలో మిత్రునిగా మారిన శ్రీ బల్వంతరావ్ ఖేడ్‌కర్ గారింట్లో దాసగణు బస మొదటి రోజులలో ఉండేది. మొదటిరోజుల్లో ఎక్కువభాగం శిరిడీలో ఉంటూ నాందేడ్‌కు వచ్చిపోయేవారు. మహాత్ముల జీవనచరిత్రను గ్రంథస్తం చేయడంలో పూర్తిగా నిమగ్నం కావడం, తరచుగా కీర్తనలను చేయడం ప్రారంభించారు. ఒకవిధంగా ఆ రోజులలోనే మధ్య భారతదేశ ప్రాంతంలో దాసగణు కీర్తనల ప్రభంజనం ప్రారంభమైంది. ఫలితంగా శిష్య గణం మెల్లమెల్లగా ఏర్పడటం ఆరంభమైంది. తరువాతి రోజులలో దాసగణుకి సన్నిహిత శిష్యులలో ఒకరైన పుండలీకరావు నాందేడ్కర్ వారి గృహం నాందేడ్‌లో దాసగణు యొక్క నివాసంగా మారింది. శిరిడీలో ఉండే రోజులలో దాసగణు బస తనకు ఎంతో ఇష్టమైన విఠల మందిరంలో

ఉండేది. స్వయంపాకం చేసుకుంటూ విఠలునికి, బాబాకి నైవేద్యం సమర్పించేవారు. బాబా తనను ఎక్కువసేపు ద్వారకామాయిలో ఉండ నిచ్చేవారు కారు. "గణూ, నీవు వెళ్ళి నీ పని చూసుకో" అని చెప్పి పంపిం చేసేవారు. తద్వారా దాసగణు యొక్క పూర్తి ఏకాగ్రత తన పారమార్థిక సాధనలైన మహాత్ముల చరిత్ర గ్రంథస్తం మరియు మహాత్ముల గుణగణా లను కీర్తించడం వంటి వాటిలో సదా నిమగ్నమయ్యేటట్లు చేసి, సద్భక్తుని పారమార్థిక ప్రగతి పట్ల సదా సావధానుడైయుండే తమ నిజ గురుతత్వాన్ని దర్శింపజేసారు. సరి!

ఇక, దాసగణు పూర్తిగా పారమార్థిక పథోన్ముఖుడయ్యాక దాసగణు జీవితంలో బాబా అనుగ్రహ విశేషంగా చోటుచేసుకున్న కొన్ని ముఖ్యమైన సంఘటనలను స్పృశించే ప్రయత్నం చేద్దాం. వాటిలో కొన్ని సంఘటనలు దాసగణు యొక్క విలక్షణమైన వ్యక్తిత్వానికి మరియు విశిష్టమైన భక్తికి అద్దం పడతాయి. అంతేకాదు, కొన్ని సంఘటనలలో అవధులు లేని సాయి అనుగ్రహం దాసగణుపై కుండపోతగా కురిసి, తద్వారా తనకు అద్భుతమైన ఎన్నో ఆధ్యాత్మిక అనుభవాలు వచ్చాయి. ఇంకొన్ని సంఘటనల మాధ్య మంగా అపూర్వమైన ఎన్నో పారమార్థిక రహస్యాల చిక్కుముడి బాబా అనుగ్రహంతో ఇట్టే విడిపోయాయి. తత్ఫలితంగా గొప్ప పారమార్థిక అనుభవ జ్ఞానం దాసగణు సొంతమయింది. ఆ అపూర్వ (సం)ఘటనల గురించి విస్తృతమైన విశ్లేషణాత్మక వివేచన చేసినట్లయితే సాటిలేని సద్గురువుగా సాయి సమర్థత అవగతమై, హృదయం సాయి పాదాలంకృతమై ప్రఫుల్లిత మవుతుంది. అవధరించండి!

**దాసగణు-రాధాకృష్ణ ఆయి :**

"భగవంతుని పారమార్థిక ఉన్నతి కోసమే ఆశ్రయించాలి" అనేది దాసగణు యొక్క దృఢమైన అభిప్రాయం. తుచ్ఛమైన ఐహిక సుఖ సంతో షాల కోసం భగవంతుని కృపను వినియోగించరాదు అనే నిశ్చితాభి ప్రాయం దాసగణులో అణువణువునా నిండియుండేది.

**(సశేషం)**






# శ్రీ సాయి నిత్య పారాయణ గ్రంథము

## భక్తి పద్య కావ్యము



రచన : "రంగరాయ" బిరుదాంకిత **శ్రీ మండువ రంగారావు**

### 11. సాయి చేతి చలువ



ఆ.వె. వెదకి వెదకి ఛాందు వేసరి పోయెను
గుఱ్ఱము గనరాక-గూటివైపు
పోవు నతని బిలసి బోగులేల యనిసాయి
కాల్వ ప్రక్కన వెదుక మనె నతని. 1

కం. రయమున యేగెను పాటిలు
హయమును గొనివచ్చి కనియె ఆశ్చర్యమునన్
పయమును యగ్నిని నొకచో
చయమున బుట్టించు నతని సాయి ఫకీరున్. 2

తే.గీ. కొంత కాలము తనయింట కొలసి యతని
పెండ్లివారితో శిరిడీకి వెడలదీసె
కని మహల్సాపతి యువకు, కాంతిమంతు
పిలచె 'సాయి' యనుచు చాలప్రేమ తోడ. 3

ఆ.వె. చిలుమును, కఫినీయు, చిన్నిడబ్బాయాస్తి
శిరిడి వాసమయ్యె చివరిదనుక
చింతలేని బ్రతుకు చిద్విలాసపు సాయి
సద్గతి నొసగేటి సద్గురుండు. 4

ఆ.వె. శిరిడి భాగ్య గరిమ శ్రీసాయి రాకతో
యనుచు సాధుసంతు జనులు బొగడె
లెండి పూలవనము లేతకుండలనీరు
సాయి మందిరమ్ము చక్కగయ్యె. 5

ఆ.వె. జలపు జ్యోతులెలిగె జాజ్వల్య మానము
సాయి చేతి చలువ సన్నుతించ
నీదు బ్రతుకు వెలుగు నిశ్చల తారయై
సాయి గొలువ భక్తి శ్రద్ధలమరి 6

ఆ.వె. సాయి పాదుకలను సద్భక్తులెందరో
వేపచెట్టు క్రింద వెలయజేసె
పాదుకలకు మ్రొక్క పాపాలు పోగొట్టి
మోక్షగామి జేయు మోద మమర. 7

తే.గీ. నింబ వృక్షపు నీడన నిలచియుండ
వేము చేదు విరగి కల్పవృక్షమయ్యె
నీదు హృదిన నిల్వగ సాయి నీవెయగుదు,
సాయితత్త్వంబు నెఱుగుచు సరిగ కొలువు 8

కం. సాయిని కొలుచుట యెటులన
రాయితి యనకుండ జనుల రక్షింప దగున్
కాయము దాయక యెపుడును
గాయము మాన్పంగ జూడు గాసిని దీర్చుమ్. 9

ఆ.వె. ఆర్త జనుల నార్తి ఆదరమున దీర్చ
ఆపదలను దీర్చి యాదుకొనును
నీదు వెంట నుండి నీ చేయి విడువక
సద్గతి కలిగించు సాయిబాబ. 10

**(సశేషం)**





# భక్తి

**– ప.పూ. స్వామీ అనుభవానంద వారు**

భక్తి ముఖ్యంగా రెండు రకాలు. ఏ భక్తినైతే కర్మకాండతో గూడా కలిపి, కర్మను దాని ఆచరణకవసరమయ్యే స్నానజపోపాసన మొదలైన నిధులతో గూడ ఆచరిస్తామో ఆ భక్తిని 'వైధీభక్తి' అంటారు. దాన్నే 'గౌణభక్తి' అని కూడా అంటారు. దీని ప్రకారం శాస్త్రంలో ఏ దేవతను ఏ విధంగా ఉపా సన చేయాలని ఉంటుందో, ఆ ఉపాసనలో మొదలేమిటో, మధ్యేమిటో, చివరేమిటో తెలుసుకొని, క్రమం కొంచెమైనా తప్పకుండా ఆచరించటం వైధీభక్తి. పూజించవలసిన దైవం విగ్రహమూర్తిగా ఉండాలా? లేక విగ్రహ సూచికపై చిహ్నంగా ఉండాలా? ఆ మూర్తి ఎలా ఉండాలి? ఎంత కొలతల్లో ఉండాలి? బంగారంతో చేయాలా? తామ్రంతో చేయాలా? మట్టితోనే చేయాలా? ఆ విగ్రహాన్ని తూర్పు ముఖంగా ఉంచాలా? ఏ వైపుకు త్రిప్పి ఉంచాలా? ఆలయం ఎంత ఎలా ఉండాలి? అనే సమస్యల దగ్గర నుండి, స్నానశౌచాదులలోనూ, వస్త్రధారణంలోనూ, పీఠాన్ని అమర్చటంలోనూ, ఒకటేమిటి-'కేశవాయ స్వాహా' అనే ఆచమన విధి నుండి 'తత్సత్ బ్రహ్మార్పణ మస్తు' అని పూజ అయిన తరువాత సర్వాన్ని ఆ దైవానికి అర్పించే పర్యంతం వీడు స్వతంత్రించి కదలటమైనా లేకుండా, ప్రతి క్రియ, ప్రక్రియలను శాస్త్ర ప్రకారం నిర్వర్తించటాన్ని వైధీభక్తి అంటారు. అందుకని దైవం మీద కంటే యీ మర్యాదల్లోనే బుద్ధి ప్రసరిస్తూ ఉంటుంది యీ భక్తి విధానంలో.

అలా కాక, యీ కట్టుబాట్లనన్నింటిని తెగకోసేది మరొక భక్తి ఉంది. అది ఎలాగంటే భర్త దూరాన ఉండటం చేత అతని మీద దృష్టి నుంచి గంధాలతో, పూలతో క్రమం తప్పకుండా పూజిస్తూ ఉంటుంది భర్త పటాన్ని సాధ్వి. కాని అతని ప్రేమమూర్తియే తన సన్నిధానంలోకి వస్తే, యీ మర్యాద

లన్నీ ఏమవుతయ్యో! ఆ ఆనందంలో, ఆ ప్రేమ ప్రవాహంలో యీ ఆచారా లన్నీ ఎక్కడికి పారిపోతయ్యో! లేక భర్త కొరకై దుఃఖం ఎక్కువైతే యీ క్రమం అంతా ఎక్కడ పోతుందో! అలాంటి దుర్భరమైన విరహవేదనా ప్రవాహంలో యీ శాస్త్ర నియమాలు కొట్టుకొనిపోతాయి. లేక ఆ భగవత్స న్నిధాన మాధుర్యాలన్నీ గోలుతూ, ఆనంద సాగరంలో విహారం చేస్తూ ఉంటే యీ శాస్త్ర వాక్యాలన్నీ ఒడ్డునే ఉండిపోవూ మరి! ఇలా రెండు విధాల గేట్లు తెగి ప్రవహించే భక్తి వాహినిని 'పరాభక్తి' అంటారు. దీనిలో విధి నియమాలనేవి లేవు. ప్రేమమూర్తియైన తల్లికి రోజూ నమస్కారాలు చేస్తావటయ్యా వెర్రివాడా!' అంటాడు శ్రీరామకృష్ణుడు యీ పరాభక్తి సాగ రంలో ఈదులాడుతూ 'సవతి తల్లిని మర్యాద చేసినట్లు, పెంపుడు తల్లిని సంతోషపెట్టటానికై ప్రేమను ప్రకటించినట్లు ఎందుకురా ప్రేమతత్వాన్ని గ్రహించలేక యిలా బ్రహ్మకర్మ బాహ్య భక్తిలో పడిపోతావు పిచ్చివాడా! అంటాడు మరొక భక్త శిఖామణి 'భగవంతుని మీద నిజంగా నీ చిత్తం లగ్నమే అయితే యీ బాహ్యాచరణలో ఎలా ఉంటావురా అజ్ఞానీ అంటాడు యింకొక భక్తాగ్రేసరుడు. పూజలో లేదు, సంకీర్తనలో లేదు, వేషాలలో లేదు, భాషల్లో లేదు, అరణ్యాలలో లేదు, గుళ్లల్లో లేదు, ఎక్కడుందయ్యా మోక్షానికి మార్గం అయిన భక్తి అంటే నీ హృదయంలోనే ఉంద'ని పాడేసింది యీ పరాభక్తి తన్మయత్వంలో మహాభక్త మీరాబాయి.

ఇప్పుడేమి అర్థం అయింది? ఈ వైధీభక్తి అనేది ప్రథమ సోపానం, పరాభక్తి అనేది చివరిమెట్టు అని తేలింది. వైధీభక్తిలో ఉండే వాడికి యీ దేవుడు వేరు, ఆ దేవుడు వేరు, యిది చేయాలి, అది చేయరాదు అనే భేదబుద్ధి యింకా ఉంటుంది. కాని పరాభక్తిలో యీ సంకుచిత భావాలకు చోటే లేదు. పరాభక్తిలో నుంచే చూస్తే ఈ ప్రపంచం అంతా. అందులో ఉన్న సర్వస్థాపర జంగమాది భూతకోటి అంతా ఆ ప్రేమమూర్తిలో లీనమై





ప్రకాశిస్తూ ఉంటుంది. ఈ ప్రపంచానికిన్నీ ఆ చిత్ర వశీకరణమూర్తికిన్నీ భేదం ఏ మాత్రం గోచరించనే గోచరించదు. అంతే ఇష్టదేవతా స్వరూపమే. అంతా ఆ దివ్యమూర్తి యొక్క తేజోపుంజమే. ఇట్టి స్థితిని 'మహాభావ సమాధి' అంటారు. అప్పుడు దేన్ని చూచినా ఆ మూర్తే! దేన్ని విన్నా ఆ మూర్తి యొక్క పలుకే! దేన్ని ఆఘ్రాణించినా ఆ మూర్తి యొక్క సుగంధ పరిమళమే! ఇంతెందుకు యీ మహాభావ సమాధిలో ఆ మహా ప్రకాశ స్వరూపుడు కానిదేదీ లేదనిపిస్తుంది. అందుకనే ఆ అనుభవాన్ని బట్టి ఉపనిషత్తుల్లో 'సర్వం ఖల్విదం బ్రహ్మ' అన్నారు.

అలా కాకుండా అంటే అనుక్షణం కాకుండా, బుద్ధిని ప్రసరింప చేసి నప్పుడే ఆ తేజోరూపం గోచరిస్తూ ఉంటే ఆ స్థితిని 'భావ సమాధి' అంటారు. ఈ రెంటిని సవికల్ప సమాధులంటారని యిది వరకే చెప్పాను. ఎందుకని? ఈ సమాధుల్లో రూపమో, భావమో ఉండటం చేత, అదీ కూడా లేకపోతే కేవలం నిర్వికల్పం అయిపోయింది. ఈ నిర్వికల్ప సమాధి అనేది యీ భక్తి యోగంలో రానే రాదు. ఎందుచేతనంటే భక్తి యోగంలో ఏ స్థితికి వెళ్లినా భగవంతుడు భక్తునికి వేరుగనే ఉంటాడు. అంటే భగవంతుడే నేను అనే స్థితి ఆ భక్తుడికి కలుగనే కలుగదు.

భక్తి యోగంలో భక్తుడు దేహ పతనానంతరం మోక్షం పొందుతాడు. శాస్త్రాలను బట్టి భక్తులకు మరణానంతరం మోక్షం నాలుగు రకాలుం టుంది. అవి గూడా ఒక దాని కంటే ఒకటి శ్రేష్ఠం. ఆ నాలుగింట్లో మొదటిది 'సాలోక్య మోక్షం'. దీని ప్రకారం భక్తుడు మరణించిన పిమ్మట ఆ పరాత్పరు డుండే వైకుంఠానికో, కైలాసానికో వెళ్లి ఆ లోకంలో ఉంటాడు. తర్వాతది 'సామీప్య మోక్షం'. దీని ప్రకారం భక్తుడు మొదటి వానివలెగాక యింకా ఆ భగవంతుడికి దగ్గరగా ఉండేటట్లు ఆ ఊళ్లోనో లేక ఆ గృహంలోనే ఉంటాడు. తర్వాత యింకా అధికుడైన భక్తుడు 'సారూప్యం' అనే మోక్షాన్ని

పొందుతాడు. ఈ భక్తుడికి తన దైవానికుండే రంగు, రూపం కలుగుతాయి. ఆ తర్వాత యింకా మేలైన భక్తుడు 'సాయుజ్య మోక్షాన్ని' పొందుతాడు. అంటే ఆ భగవంతునికున్న శక్తుల్లో కొన్ని శక్తులు కూడా అతనికి వస్తాయి.

కాని యింతైనా కూడా తాను పూర్తిగా భగవంతుడే కావటానికి మాత్రం అసలు వీలే లేదు భక్తి మార్గ ప్రకారం. ఈ రకంగా భగవంతుడు వేరు, జీవుడు వేరు అనే పద్ధతిని ద్వైతమార్గం అంటారు. అలాకాక, ఆ బ్రహ్మమే నేను, నేనే ఆ బ్రహ్మాన్ని అనే 'అహం బ్రహ్మాస్మి' అనే స్థితికి ఉపనిషత్తుల ప్రకారం ఏ ముముక్షువు వస్తాడో వాడిని జ్ఞాని అనీ, అద్వైతి అనీ, బ్రహ్మ విదుడనీ అంటారు. ఈ చివరి మార్గాన్ని యిక తెలుసుకుంటావు.

ఇప్పుడు భక్తి అంటే ఏమిటో, దాని నిర్వచనం ఏమిటో, అది ఎన్ని రకాలో, దాని స్థితి ఏమిటో, దాని పర్యవసానం ఏమిటో మొదలైన విషయాలన్నీ విన్నారు. ఈ భక్తి యోగం యొక్క ఔన్నత్యం, సౌలభ్యం విన్నారు. ఇక మిగిలి ఉన్నదేమిటి? విన్నదాన్ని తినటానికి యత్నించాలి. ఒక పండు రుచి విన్నావు. 'ఆహా! ఎంత రుచి ఎంత రుచి! అన్నారు. మీరు విన్నారు. ఏమి ప్రయోజనం? దాని మాధుర్యం మీకు తెలిసిందా? మీకు ఏమైనా తృప్తి కలిగిందా? దాన్ని అనుభవించారు గదా అని ఆనందం పెసరంతైనా కలిగిందా? నీవు ఇలా శ్రమపడి చదువుకోవటం, వినటం ఎందుకు? అందుచేత విన్నదాన్ని ఆలోచించాలి. ఆలోచించిన దాన్ని అనుభవించాలి. వీటినే శ్రవణ మనన నిధి ధ్యాసనలంటారు. మీరు అలా ఆచరించుకుంటారని నమ్ముతున్నాను.

అతడే మన దిక్కు - అతడే మన గమ్యం.





# ఆలోచించండి

ఆలోచన, అవగాహన అన్నవి సమగ్రంగా ఉండాలి. ఎంతో తెలివైన వారు కూడా చటుక్కున అసమగ్రమైన ఆలోచనలలోకి జారిపోతూ ఉంటారు. ఒకసారి ఒక పెద్ద మనిషి ఓ చక్కని తెల్లని కాగితం తెచ్చి గోడ మీద పిన్ చేశాడు. అది ఒక సెమినార్. అనేక రంగాల మేధావులు అక్కడ ఉన్నారు. అందరూ ఆసక్తిగా అతని వైపే చూస్తోంటే పెద్దమనిషి ఆ కాగితం మీద ఒక మూల పెద్ద నల్లని చుక్క ఒకటి పెట్టాడు స్కెచ్‌పెన్‌తో. హాల్లోని వారివైపు తిరిగి 'యిప్పుడు మీరేం చూస్తున్నారు?" అని అడిగాడు.

"నల్ల చుక్క - ఎ డాట్" అన్నారందరూ ఏకకంఠంతో.

"ఖచ్చితంగా నల్లచుక్కేనా?"

"అవును"

"సందేహం ఏమీ లేదుగా!"

"లేదు!"

పెద్దమనిషి అన్నాడు.

"చూచారా! మీ అందరికీ ఎదురుగా తెల్ల కాగితం ఉంది. దాని మీద ఒక చుక్క ఉంది. మీరు రెండూ చూచారు. కానీ, ఒక్క చుక్క గురించే చెప్తున్నారు. అంటే దృష్టి సరిగానే ఉంది. రెండూ చూచారు. కానీ, ఆలోచన మాత్రం సమగ్రంగా సాగటం లేదు. మనలో చాలామందికి ఏవో కొన్ని పార్శ్వాలలోనే ఆలోచించటం అలవాటవుతుంది. విషయాన్ని అన్ని కోణాలలో నుండి పరిశీలించటం నేర్చుకోవటం అవసరం. అది మంచి అవగాహనను ఇస్తుంది.

ఓం శ్రీ సాయిరాం

శుభకృత్ నామ సంవత్సర

# గురుపూర్ణిమోత్సవం



ప్రియ మిత్రులందరికీ నమస్సులు,

వ్యాస మహర్షుల పేరిట ఏర్పడిన వ్యాసపూర్ణిమే గురుపూర్ణిమగా వ్యవహరింపబడుతున్నది. ఈ సంవత్సరం అది జూలై 13వ తేదీన వస్తున్నది. సాయిభక్తులందరూ యీ శుభదినంనాడు సాయిధామం ఆశ్రమంలో జరగనున్న గురుపూజోత్సవానికి వచ్చి, శ్రీ సాయి ఆశీస్సులు పొందవలసినదిగా సాయిధామం ఆహ్వానిస్తున్నది.

## కార్యక్రమాల వివరాలు

**జూలై 13, 2022 బుధ వారం**

| | | |
|---|---|---|
| ఉదయం | 5.15 | కాకడ హారతి |
| | 6.00 | క్షీరాభిషేకం, పూజ |
| | 7.00 | పూజ్య గురుదేవులకు క్షీరాభిషేకం, పూజ |
| | 10.30 | శ్రీ సాయిదేవులకు సహస్రనామాలతో పుష్పార్చన |
| | 11.15 | గురు పాదుకా పూజ |
| | 11.30 | గురు ప్రవచనం |
| మధ్యాహ్నం | 12.00 | మహా హారతి |
| | 12.30 | గురు ఆశీస్సులు |
| | 1.00 | అన్నప్రసాద వినిమయం |

భక్తులందరూ పై పూజా కార్యక్రమాలలో పాల్గొని ధన్యులై సాయినాధుల కృపకు పాత్రులు కాగలరని మనసారా ఆహ్వానం పలుకుతుంది మీ సాయిధామం సేవాశ్రమం.

ఫోన్స్ : 9440413455,
9848133565

ఇట్లు,
సాయిధామం





# రాగద్వేషాలు

**– మాతా శుకవాణి, సాయిధామం(ఎ.ఐ.ఆర్. సౌజన్యంతో)**

వెలుగునీడలు, సుఖదుఃఖాలు, కలిమిలేములు, వీటిలాగానే రాగద్వేషాలు అన్నది కూడా ద్వంద్వాలలో ఒకటి. రాగం, రక్తి, అనురాగం-యిలాంటివన్నీ ప్రేమకూ, అభిమానానికీ సూచకాలు. కాగా, దానికి వ్యతిరేకమైనది ద్వేషం. అసలు సృష్టి యావత్తూ పరస్పర వైరుధ్యాలున్న ద్వంద్వాలతోనే నడుస్తూంటుంది. స్త్రీ, పురుషులు లేనిదే సృష్టి కార్యం లేదు. నలుపు లేనిదే తెలుపు యొక్క విశిష్టత గోచరించదు. చీకట్లు తొలగినంక వచ్చే వెలుతురు మనోహరం. ఎడబాటు తరువాత కలయిక సుందరం మొత్తం మీద అన్నీ కలిస్తేనే ఆనందం. ఇవన్నీ ఒకదాని తరువాత ఒకటి తప్పక వస్తూనే ఉంటాయి.

మనకు ఎవరి పట్ల రాగం కలుగుతుంది? ఎవరి పట్ల ద్వేషం కలుగుతుంది? ఈ రాగద్వేషాలకు మూలం అవతలి వారి ప్రవర్తనే కారణమా? కాదేమో! ఎందుకంటే మనం ఎవరిని అభిమానిస్తాం? మన భావాలకు, ప్రణాళికలకు అనుకూలంగా ఉన్న వారి పట్ల మనకు ఒక స్పందన కలుగుతుంది. ఆ స్పందనే బలపడితే రాగంగా మారుతుంది. అలాగే మన భావనలకు వ్యతిరేకంగా ఉన్న ఉద్దేశ్యాలు మనకు చికాకు కలిగిస్తాయి. అలాంటి ఉద్దేశ్యాలున్న వారి పట్ల మనకు ఒకానొక అయిష్టత ఏర్పడుతుంది. అదే క్రమంగా ద్వేషంగా రూపొందుతుంది. (అంచేత రాగద్వేషాలకు మూలం మనలోనే, మన ఆలోచనల్లోనే ఉంది తప్ప ఎదుటి వారిలో లేదన్న మాట!)

అయితే కొందరిని చూడగానే అవ్యాజమైన ప్రేమ కలుగుతుంది. మరి కొందరిని చూస్తే అసంకల్పితంగానే ద్వేషం ఏర్పడుతుంది గదా! అదెందుచేత? ఎదుటివారి గురించిన వివరాలేవీ తెలియకుండానే రాగద్వేషాలు ఏర్పడుతున్నప్పుడు, ఇలాంటి వాటిని జననాంతర సౌహృదాలు అంటారు.

అంటే- ఆ ఎదుటి వ్యక్తితో మనకు గత జన్మలలో కొంత అనుబంధం ఉండి ఉంటుంది. దాని బలం యీ జన్మలో కూడా పనిచేసి ఒకానొక రాగమో, ద్వేషమో ఏర్పడుతుండవచ్చు. ఈ జన్మలో కూడా మనకు అను బంధం లేకపోయినా ఏదో ఒక బలమైన కారణం ఇలాంటి భావాలకు మూలం కావచ్చని పెద్దలు ఒక కథ చెప్తారు పూర్వం ఒక రాజుగారు ప్రతి రోజూ సాయంత్రం పూట తన భవనం పైకెక్కి త్రోవన వచ్చేపోయే పౌరులను చూస్తూ విహరిస్తూ ఉంటారు. తన పౌరులను చూచినప్పడు ఆ ప్రభువుకు గొప్ప ప్రేమ ఆనందం కలుగుతుంటాయి.

కానీ, ప్రొద్దు వాటారే వేళకు ఒక కట్టెలు కొట్టేవాడు మోపు నెత్తిన పెట్టుకుని ఇంటికి వెడుతూ కనిపిస్తాడు. అతన్ని చూడగానే మాత్రం రాజు గారికి ఒళ్ళు మండిపోతుంది. అప్రయత్నంగానే చెయ్యి కత్తి మీదకు పోతుంది. వాడెవరో? వాడి చరిత్ర ఏమిటో? ఏమి తెలియకుండానే తనలో కలుగుతున్న ఈ సంచలనానికి రాజు ఆశ్చర్యపడ్డాడు. విషయమంతా మంత్రి గారికి చెప్పి ఆ కట్టెల వాడి కథ ఏమిటో తెలుసుకు రమ్మన్నారు. మంత్రి సామాన్య రైతు వేషంలో కట్టెలవాడి ఇంటికి వెళ్ళాడు. ఎలాగోలా పరిచయము చేసుకొని ఆ పూట అతని ఇంట్లో ఆతిథ్యం సంపాదించు కున్నాడు. భోజనాల వేళ ఇంటి లోపలకు తీసుకువెళ్ళాడు కట్టెలవాడు. మంత్రిగారికి ఆ ఇంటిలో ఒక మూల పేర్చిపెట్టిన గంధపు చెక్క కన్పించింది. ఇలా దాచి పెట్టుకున్నావెందుకు? ఇందులో సగం అమ్మినా నువ్వు లక్షాధికారివి కావచ్చు కదా" అని అడిగాడు. దానికి కట్టెలవాడు చిరునవ్వుతో "దీన్ని సామాన్యులు కొనలేరే" అన్నాడు. "మరెందుకు దాచినట్లు ఎవరైనా పెద్దవారికి చూపించకపోయావా" అన్నాడు మంత్రి. దానికి "రాజుగారు ఒక్కరే కొనగలరు" అని జవాబిచ్చాడు కట్టెలవాడు కొంచెం తటపటాయిస్తూ. "అది కాదండీ! మహారాజులు మరణిస్తే గంధపు చెక్కలతోనే దహనం చేస్తారు. వారు సర్వశ్రేష్ఠమైన కలపే కొంటారు





కదా! అందుకని ఈ నిలువ చేశాను" అన్నాడు రహస్యం చెప్తున్నట్లు. మంత్రి గారికి విషయం అంతా అర్థమైపోయింది. "ఓహెూ! ఇతగాడు రాజెప్పడు చచ్చిపోతాడా, ఎప్పడు తన కట్టెకు తగిన ధర వస్తుందా" అని ఎదురు చూస్తున్నాడు. ఇతనిలో ఈ కోరికే, వీని భావన యొక్క బలమే రాజు మనస్సు మీద ప్రభావం చూపిస్తోంది. ఆయనలో కూడా ద్వేషాన్ని రగుల్చు తోంది. మరి ఇలా రాగద్వేషాలు ఇచ్చిపుచ్చుకునేవే అయితే సర్వ జనులను ఎంతగానో ప్రేమించిన శ్రీ సాయినాథుల వారిని చంపబోయిన రోహిల్లా సంగతేంటి? రమణ మహర్షిని కొట్టిన దొంగల సంగతేంటి? కనుక ఇవి కేవలం ఇచ్చిపుచ్చుకునేవి మాత్రమే కావని తేలిపోయింది.

శ్రీ రామానుజాచార్యుల వారిని అవమానించాలన్న ఉద్దేశ్యంతో వారు గంగా స్నానం చేసి వచ్చే దారిలో చెప్పల తోరణం కట్టారు ఆయన విద్వేషులు. రామానుజుల తలకు ఆ తోరణం తగిలింది. వెంటనే వారు కళ్ళు మూసుకొని తాదాత్మ్యం చెందుతూ "ఆహా! ఏమి నా భాగ్యం! ఇందరు భక్తుల పాదధూళి అడగకుండానే లభించిందే నాకు అని పరవశించి పోయాడట ఈ విషయం చెప్పి. మా గురుదేవులు స్వామీ సత్యపదానంద ప్రభుజీ వారు ఇలా చెప్పారు. రాగద్వేషాలను నెట్టి పారేయాల్సిన పనేమీ లేదు మీ లోపలే ఉంచుకోండి. ఎటొచ్చీ మీ సాధనకు అనుకూలమైన వాటిపైన రాగాన్ని పెంచుకోండి. సాధనకు అడ్డు తగిలే మీ లోపలి దుష్ట గుణాలపైన ద్వేషాన్ని ప్రదర్శించండి" అని. తథాస్తు.

## సాయివాణి పాఠకులకు మనవి

సాయివాణి పాఠకులకు విజ్ఞప్తి - సాయివాణి జూన్ 2022 పత్రికలో టైటిల్ పేజీ మీద జూన్ 2022 బదులు పొరపాటున జూన్ 2021 అని ప్రచురితమైనది. పాఠకుల అసౌకర్యానికి చింతిస్తున్నాము.

**- సంపాదకులు**